క్లుప్తంగా

మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా కనకదుర్గ

మొగల్తూరు: మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా పేరుపాలెం సౌత్‌కు చెందిన వనమాలి కనకదుర్గను ఎన్నుకున్నారు. మంగళవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సభ్యులు ఆమెను ఎన్నుకున్నారు. మండలంలోని 68 గ్రామ సంఘ అధ్యక్షులకు గానూ 60 మంది హాజరైయ్యారని, వీరంతో అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకున్నారన్నారని ఏపీఎం జి.ప్రభుదాస్ తెలిపారు. ఉపాధ్యక్షురాలిగా రామన్నపాలెంకు చెందిన కుక్కల నాగమణి, కార్యదర్శిగా మొగల్తూరుకు చెందిన జక్కంశెట్టి నాగమణి, సహాయ కార్యదర్శిగా పాతపాడుకు చెందిన బొడ్డు ఆదిలక్ష్మి, కోశాధికారిగా శేరేపాలెంకు చెందిన కత్తుల చంద్రావతి మరో ఐదుగురిని సభ్యులుగా ఎన్నుకున్నారు.

జలశక్తి అభియాన్ పనులు పూర్తి చేయాలి

పెనుగొండ: సన్న, చిన్న కారు రైతుల ప్రయోజనాల కోసం మంజూరైన జలశక్తి అభియాన్ పనులను సత్వరం పూర్తి చేయాలని కేంద్ర అగ్రి కల్చరల్, ఫార్మర్స్ వెల్ఫేర్ డైరెక్టరు, జలశక్తి అభియాన్ సెంట్రల్ టీం నోడల్ అధికారి డాక్టర్ జితేంద్ర సింగ్ ఆదేశించారు. మంగళవారం జలశక్తి అభియాన్ సెంట్రల్ టీం రెండో రోజు పర్యటన ఆచంట మండలం భీమలాపురంలో నిర్వహించారు. హార్టికల్చర్‌లో భాగంగా చిన్న, సన్నకారు రైతులకు చెందిన 20 ఎకరాల్లో చేపట్టిన తైవాన్ జామ పంటను పరిశీలించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త మానిక సింగ్, డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు, ఆచంట ఎంపీడీఓ టి.బాబ్జి, ఏపీఓ సుదర్శన్, ఆదినారాయణ, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ధాన నంద్, ఏఈ సాయి ప్రకాశ్ పాల్గొన్నారు.

నరసాపురంలో..

నరసాపురం రూరల్: మండలంలోని సీతారామపురం, రుస్తుంబాద గ్రామాల్లో మంగళవారం కేంద్ర బృందం పర్యటించి పలు ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కేంద్ర జలశక్తి అభియాన్ చీఫ్ నోడల్ ఆఫీసర్ జితేంద్ర సింగ్, శాస్త్ర వేత్త మానికా సింగ్ లతో ఉన్న బృంద సభ్యులు మందుగా గ్రామంలో జరిగిన పనులపై క్షేత్ర స్థాయి సహాయకులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణంరాజు, ఏపీడీ శ్రీనివాస్, కార్యదర్శి శ్రీనివాస్, సర్పంచ్ దొండపాటి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



పెనుగొండ: ఆచంట మండలం భీమలాపురంలో పర్యటిస్తున్న కేంద్ర బృందం



పెనుమంట్ర: పాలమూరులో మామిడి మునగ తోటలను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

సన్నకారు రైతుల ప్రయోజనాలే లక్ష్యం

పెనుమంట్ర: సన్న, చిన్నకార రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా జలశక్తి అభియాన్ పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కేంద్ర వ్యవసాయ పార్మర్ వెల్ఫేర్ డైరెక్టర్, జలశక్తి అభియాన్ సెంట్రల్ మోడల్ అధికారి డాక్టర్ జితేంద్రసింగ్ స్థానిక అధికారులను ఆదేశించారు. మంగళవారం జలశక్తి అభియాన్ సెంట్రల్ టీం జిల్లాలో రెండోరోజు పర్యటనలో భాగంగా పెనుమంట్ర మండలం పాలమూరు గ్రామంలో జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా సన్న చిన్నకారు రైతుల భూముల అభివృద్ధిలో భాగంగా చేపట్టిన మామిడి, మునగతోటలను పరిశీలించింది. కార్యక్రమంలో జాతీయ సైంటిస్ట్ మానికాసింగ్, డ్వామా పీడీ డాక్టర్ సిహెచ్ అప్పారావు, ఎంపీడీఓ శర్మ, ఏపీఓ బాపూజీ, సుదర్శన్ పాల్గొన్నారు.

పోడూరులో ఐసీడీఎస్ కార్యాలయం అనుకూలమే

సాక్షి స్పందన

పాలకొల్లు అర్బన్: నియోజకవర్గ పునర్విభజనలో పాలకొల్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు పోడూరు ప్రాజెక్టు నుంచి విలీనమైనప్పటికీ కార్యాలయం పోడూరులో నిర్వహించడానికి అన్ని సౌకర్యాలు ఉన్నాయని జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ బి సుజాతరాణి ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. సాక్షి లో అంగన్‌వాడీలకు అవస్థలు శీర్షికతో ప్రచురితమైన వార్తకు ఆమె స్పందించారు. పోడూరులో ప్రాజెక్టుకి సొంత భవనం ఉందని, అలాగే రవాణాకు కూడా అనుకూలమేనని పేర్కొన్నారు. నెల వారీ సమావేశాలకు ఒకసారి మాత్రమే అంగన్‌వాడీ కార్యకర్తలు పోడూరు వస్తుంటారని, సమావేశాలు నిర్వహించుకోవడానికి, అలాగే ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఆహార పదార్థాలు నిల్వ చేసుకోవడానికి గొడౌన్ సౌకర్యం ఉన్నాయని వివరించారు.

నేడు హుండీ ఆదాయం లెక్కింపు

మొగల్తూరు: మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న శ్రీబండి ముత్యాలమ్మ అమ్మవారి హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించనున్నట్లు ఈఓ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

రోగులకు మందుల అందజేత

పాలకొల్లు అర్బన్: నిస్సహాయులకు ఆదుకోవడంలోనే నిజమైన ఆనందం ఉందని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరావు అన్నారు. మండలంలోని పెదమామిడిపల్లిలో పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులకు మంగళవారం వాకర్స్ తరపున రూ.12 వేలు విలువైన మందులను అందజేశారు. కుక్కల వేపాలస్వామికి, కవురు పెద్దింట్లుకి మందులను అందజేశారు. కంటి శస్త్ర చికిత్స చేయించుకున్న కవురు ధనలక్ష్మికి కళ్లజోడును క్లబ్ సభ్యులతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్‌సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకర్, ఉపాధ్యక్షుడు మానెం బసవరాజు పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధికి రూ.25 వేలు అందజేత

పాలకొల్లు సెంట్రల్: స్థానిక జీవీఎస్‌వీఆర్‌ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి దాత నడపన జగపతిరావు రూ. 25 వేలు చెక్కును అందించారు. మంగళవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాయపూడి భవానీప్రసాద్ విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. దాత జగపతికి కృతజ్ఞతలు తెలియజేశారు.

అన్ని వ్యాధులూ హోమియోతో దూరం

కోసూరి రామకృష్ణ ఆనందరాజు



అన్ని వ్యాధులను తగ్గించే గుణం హోమియోపతిలో ఉందని శ్రీ రామకృష్ణ పరమహంస హోమియోపతిక్ ఆస్పత్రి వైద్యుడు కోసూరి రామకృష్ణ ఆనందరాజు అన్నారు. గత 87 సంవత్సరాలుగా హోమియోపతి వైద్య సేవలు అందిస్తున్నామని, ఉభయ గోదావరి జిల్లాల్లో రోజుకో గ్రామంలో ఉచిత వైద్య సేవలు కూడా అందిస్తున్నామని వివరించారు. రెండు జిల్లాల్లో మొత్తం 20 బ్రాంచ్‌లు ఉన్నాయని, బ్రాంచ్‌ల్లో హోమియో వైద్యులు రెండు రోజులకోసారి అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. వీడియో కాల్ ద్వారా కూడా ట్రీట్‌మెంట్ అందిస్తున్నామని స్పష్టం చేశారు. మనిషి శరీరతత్వానికి తగ్గట్టుగా హోమియోపతి ట్రీట్‌మెంట్ అందిస్తామని, సోరియాసిస్ కూడా హోమియోపతి వల్ల శాశ్వతంగా తగ్గుతుందని పేర్కొన్నారు. మెడ నొప్పులు, నడుము నొప్పులకు ఆపరేషన్ లేకుండా హోమియోపతి ద్వారా తగ్గించవచ్చని వివరించారు.

ఆర్యపేటలో వైద్య శిబిరం

యలమంచిలి: మండలంలోని ఆర్యపేట గ్రామంలో మంగళవారం విజయవాడకు చెందిన పీవీఆర్ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి వైద్యులు గుండె, సాధారణ రోగులకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని స్థానిక సర్పంచ్ మేడిది విజయ జ్ఞానమణి ప్రారంభించారు. శిబిరంలో 148 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 68 మందికి గుండెకు సంబంధించిన ఈసీజీ, 2 డీ ఎకో పరీక్షలు ఉచితంగా చేశారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శిబిరంలో డాక్టర్లు పి.వెంకటరామ్, సందీప్, మాధురి, హర్షిత, మహిమ సేవలను అందించారు. శిబిర నిర్వహణకు పవన్‌కుమార్, సుభద్రలు సహకారం అందించారు.



ఆర్యపేటలో 2డీ ఎకో పరీక్షలు చేస్తున్న వైద్యులు

మొగల్తూరులో ఉచిత కంటి వైద్య శిబిరం

మొగల్తూరు: కంటి సమస్యలపై నిర్లక్ష్యం వహించడకుండా కళ్ల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ డాక్టర్ ఎస్‌వీ రంగారావు కోరారు. మొగల్తూరు లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో మంగళవారం స్థానిక శ్రీనివాస ఆపుపత్రిలో ఏర్పాటు చేసిన ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. పాలకొల్లుకు చెందిన రాధా రమణి లయన్స్ కంటి ఆసుపత్రి ఆద్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో 103 మందికి పరీక్షలు నిర్వహించగా 42 మందికి ఆపరేషన్‌లు అవసరమైనట్లు గుర్తించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాసరాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు యు.గీతా రాంబాబు, గుబ్బల నాగరాజు, తణుకుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను ఉన్నతాధికారులకు నివేదిస్తాం

మొగల్తూరు: గ్రామంలోని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని డ్వామా పీడీ డాక్టర్ కేసీహెచ్ అప్పారావు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు మొగల్తూరులో గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలోని సినీ నటుడు చిరంజీవి ఇంటి వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పవన్ కల్యాణ్ సూచనలతో ఆయన సొంతూరు మొగల్తూరులో నెలకొన్న సమస్యలను తెలుసుకునేందుకు గ్రామ సభ ఏర్పాటు చేశామన్నారు. ఈ గ్రామంలో రూ.కోటి 66లక్షలతో సిసి రోడ్లు నిర్మాణాలకు రూ.3.30కోట్లుతో డ్రెయిన్ నిర్మాణంకు ప్రతిపాదనలు వచ్చాయన్నారు. మరికొన్ని ప్రతిపాదనలు కూడా తీసుకోవడం జరిగిందని వీటికి పూర్తిస్థాయిలో అంచనాలు రూపొందించి ఉపముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పడవల మేరీ సత్యనారాయణ, ఉప సర్పంచ్ బోణం నర్సింహరావు, ఎంపీడీఓ త్రిశూల పాణి, పీఆర్ డీఈ సత్యనారాయణ, ఏఈ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ అప్పారావు

యువతి ఆత్మహత్య కేసులో నిందితుడికి రిమాండ్

నరసాపురం రూరల్: మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామం ప్రగతి నగర్‌లో ఈ నెల 4వ తేదీన యువతి ఆత్మహత్యకేసులో నిందితుడిని మంగళవారం అరెస్టు చేసి కోర్టుకు పంపగా రిమాండ్ విధించినట్లు ఎస్సై టి వెంకట సురేష్ తెలిపారు. దీనికి సంబంధించి ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన టంకాని సాయి లక్ష్మి కుమారి (19) ఆత్మహత్య కేసులో ముద్దాయి కవురు గీతా చరణ్ ను మంగళవారం అరెస్టు చేశామన్నారు. ఈ కేసులో మృతురాలి తండ్రి సింహాచలం ఇచ్చిన పిర్యాదు మేరకు రెండు పోలీసు బృందాలు గాలించి మంగళవారం యర్రంశెట్టివారిపాలెం పితానిమెరక వద్ద ముద్దాయి ఇంటి వద్ద అరెస్టు చేశామన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ముద్దాయిని కోర్టులో హాజరు పరచగా కోర్టు రిమాండ్ విధించిందని ఎస్సై వెంకట సురేష్ పేర్కొన్నారు.

జూద క్రీడలతో కుటుంబాలు ఛిన్నాభిన్నం

పెనుగొండ: సంక్రాంతి పండుగ సందర్భంగా సాంప్రదాయం ముసుగులో జూదాలకు పాల్పడితే కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతాయని ఆచంట తహసీల్దారు జి.కనకరాజు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు వివరించారు. కోడి పందేలు, బెట్టింగులు, గుండాట, కేసినోలు, పేకాట, జూదం కొతాట, అక్రమ మద్యం వంటివాటి చట్ట వ్యతిరేక కార్యకలాపాలతో తీవ్ర నష్టం వాటిల్లుతుందన్నారు. దీని నివారణకు 8న ఆచంట, వల్లూరు, భీమలాపురంల్లోనూ, 9న కొడమంచిలి, కోడేరు, పెదమల్లంల్లోనూ, 10న కరుగోరుమిల్లి కందరవల్లి, పెనుమంచిలి, ఆచంట వేమవరంల్లోని సచివాలయాల పరిధిలో అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రీ సర్వేకి పైలట్ గ్రామంగా దగ్గులూరు

పాలకొల్లు అర్బన్: మండలంలోని దగ్గులూరు గ్రామాన్ని భూ సర్వే నిమిత్తం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు తహసీల్దార్ యడ్ల దుర్గా కిషోర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 20 నుంచి సర్వే అధికారులతో కలిసి గ్రామంలో భూ సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులందరికీ భూ సర్వే నిమిత్తం నోటీసులు జారీ చేస్తామని, పేర్కొన్నారు.

19న కర్ణభక్త సమాజం సమావేశం

పాలకొల్లు సెంట్రల్: మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని కర్ణభక్త సమాజ సంక్షేమ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలో ఈ నెల 19న శ్రీశైలం సత్రం కమిటీ మహాజన సభ నిర్వహించనున్నట్లు సంఘ ప్రధాన కార్యదర్శి శాగా రాంబాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో ఉదయం 10 గంటలకు ఈ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఫిబ్రవరి 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జునస్వామి వారి బ్రహ్మోత్సవాలు, కోటప్పకొండ శ్రీ త్రికూటేశ్వరస్వామి వార్ల ఉత్సవాలు పురస్కరించుకుని సత్రాల్లో ఏర్పాటు చేయనున్న అన్నదానం, వసతి సౌకర్యాలపై ఈ సమావేశంలో సమీక్ష చేస్తామన్నారు. ఈ సమావేశానికి కర్ణభక్త సంఘ సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

స్త్రీనిధి రుణాల వసూళ్లలో రెండో స్థానం

మొగల్తూరు: స్త్రీ నిధి రుణాల వసూళ్ళలో మనజిల్లా రెండో స్థానంలో ఉందని స్త్రీనిధి అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కృష్ణమనాయుడు తెలిపారు. మంగళవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయానికి వచ్చిన ఆయన రికార్డులను పరిశీలించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. సంఘాల అభ్యున్నతి కోసం 2002లో బ్యాంక్ లింకేజ్ రుణాలు, ఎస్‌సీ, ఎస్‌టి నిధులు ఇచ్చారన్నారు. సుమారు రూ.150 కోట్ల రుణాలనందించడం, వసూళ్లు చేయడం ద్వారా రాష్ట్రంలోనే మన జిల్లా రెండో స్థానంలో ఉందన్నారు. సమావేశంలో మేనేజర్ చిట్టిబాబు, ఏపీఎం ప్రభుదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫీల్డ్ విజిట్ తప్పనిసరి

యలమంచిలి: వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్స్‌తో కలిసి ఆశా కార్యకర్తలు క్రమం తప్పకుండా గర్భిణులు, బాలింతలు, బరువు తక్కువగా ఉన్న పిల్లల ఇంటికి వెళ్లాలని మహిళ, శిశు సంరక్షణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్.సుజాత రాణి కోరారు. ఆశా డే సందర్భంగా మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వద్ద వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ వర్కర్స్, ఆశా కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు ఎంతమంది ఉన్నారు? ఫీల్డ్ విజిట్ ఎలా చేస్తున్నారు? బరువు తక్కువగా ఉన్న పిల్లలకు ఏ విధమైన ఆహారం సిఫారసు చేస్తున్నారు? తదితర విషయాలపై ఆమె శాఖల వారీగా సమీక్ష చేశారు. కార్యక్రమంలో డాక్టర్ ఎస్.సతీష్, నోడల్ ఆఫీసర్ విజయలక్ష్మీ, సీడీపీఓ చెల్లుబోయిన ఇందిర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహ్మద్ హసీనా తదితరులు పాల్గొన్నారు.

దంత సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

డాక్టర్ కె సుందర్రావు



ఏదైనా ఆహారం తిన్నవెంటనే తప్పని సరిగా పళ్లు పుక్కిళిం చాలని మణి దంత వైద్యశాల వైద్యుడు కె.సుందరరావు అన్నారు. 90 శాతం దంతాలు తిన్న వెంటనే శుభ్రం చేసుకోకపోవడం వల్లే పాడవుతున్నాయని వివరించారు. చిన్నపిల్లలకు నాలుగు నెలల సమయంలోనే పాల దంతాలు రావడం మొదలవుతుందని, ఆ సమయంలో తల్లి తీసుకునే ఆహారం, మందుల వల్లే శిశువుల పాల దంతాలు పాడవుతూ ఉంటాయని పేర్కొన్నారు. ఎమిలోజెనిసెస్ ఇంపర్‌ఫెక్ట్, డెంటినోజెనిసెస్ ఇంపర్‌ఫెక్ట్ వల్ల దంతాలపై ఉండే ఎనామిల్ పోతుందని కాబట్టి బిడ్డకు పాలు పట్టించిన వెంటనే నోటిని శుభ్రం చేస్తుండాలని సూచించారు. అలా చేయకపోవడం వల్ల పాల దంతాలు త్వరగా పాడయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. సంవత్సరం దాటిన చిన్నారులకు డబ్బాపాలు తప్పించి గ్లాస్‌లో వేసి పట్టించడం అలవాటు చేయాలని వివరించారు. పన్ను పాడవడం మొదలు పెట్టిన వెంటనే వైద్యులను సంప్రదించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. తద్వారా పన్నుపోటు రాకుండా, రూట్‌కెనాల్ వంటి చికిత్సల నుంచి, ముఖ్యంగా పళ్లు తోముకునే బ్రష్ సాఫ్ట్‌గా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు.

ఆధ్యాత్మిక నగరం..వాణిజ్యంలో ప్రథమం

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రాల్లో ఒకటిగా విరాజిల్లుతున్న పాలకొల్లు నియోజకవర్గం ఆధ్యాత్మికంతో పాటు కళలకు, వాణిజ్యపరంగా ఎంతో గుర్తింపు పొందింది. ఆధ్యాత్మికంగా పంచారామక్షేత్రం శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి దేవస్థానం అలాగే వాణిజ్య పరంగా సుమారు వంద సంవత్సరాలు చరిత్ర కలిగిన వస్త్ర వ్యాపారం, అపరాలు, కొబ్బరి వ్యాపారం, గోదావరి అందాలతో పర్యాటకులను కట్టిపడేసే చూడచక్కని తీర ప్రాంతం, ఎందరో సినీ, రంగస్థల కళాకారులను అందించిన క్షీరపురి వైభవం ఎంతో గొప్పది. పంచారామక్షేత్రాల్లో ఒకటైన శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయం (పెద గోపురం) 120 అడుగుల ఎత్తైన గాలిగోపురంతో ప్రసిద్ధి చెందింది. కార్తీకమాసంతో పాటు మహాశివరాత్రి, దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల్లో ఆలయం భక్తులతో కిటకిటలాడుతుంది. ఈ ఆలయంలో ప్రతి సంవత్సరం శ్రీరామనవమి అనంతరం స్వామివారి కల్యాణం నిర్వహిస్తారు. ఆలయంలో దాతల సహకారంతో నిత్యాన్నదానం ఏర్పాటు చేస్తున్నారు.

వస్త్ర రంగంలో మినీ ముంబై

వస్త్ర రంగంలో సుమారు 80 ఏళ్ల చరిత్ర పాలకొల్లుకు సొంతం. ఇక్కడ ప్రతి శుక్రవారం దేవునిహాలు మార్కెట్‌లో హోల్‌సేల్ వ్యాపారం జరుగుతూ ఉంటుంది. వస్త్ర వ్యాపారంలో పాలకొల్లుకు సెకండ్ ముంబై అనే పేరు ఉండేది. దేవుని హాల్లో ప్రతి శుక్రవారం వేకువజామున 3 గంటల నుండి



పాలకొల్లు పట్టణ వ్యూ

వ్యాపారం ప్రారంభమవుతుంది. మొత్తం పట్టణంలో సీజన్‌లో వస్త్ర వ్యాపారం రోజుకు రూ. 4 నుంచి 6 కోట్ల వరకూ వ్యాపారం జరుగుతూ ఉంటుంది.

విస్తరిస్తున్న వైద్యరంగం

గతంలో చిన్నపాటి గాయానికి కూడా వైద్యం కోసం భీమవరం, విజయవాడ, వైజాగ్, ఏలూరు, హైదరాబాద్ ప్రాంతాలకు పరుగులు తీసేవారు. అలాంటి ప్రస్తుతం పాలకొల్లులో వైద్య రంగం రోజురోజుకూ విస్తరిస్తుంది. మేజర్ శస్త్ర చికిత్సలు కూడా పట్టణంలోనే ప్రముఖ ఆస్పత్రుల్లో జరుగుతున్నాయి. పాలకొల్లులో వైద్య రంగం విస్తరించడంతో సమీప గ్రామాల ప్రజలక మేలైన వైద్య సేవలు అందుతున్నాయి. ఇటీవల పట్టణం చుట్టూ అనేక ఆసుపత్రులు నూతనంగా ఏర్పాటయ్యాయి. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ఆసుపత్రులు నిర్మాణం చేశారు. అతి తక్కువ ఫీజులతో కార్పొరేట్ వైద్యం నేడు పట్టణంలోనే అందుతుంది.

కొబ్బరి వ్యాపారానికి ప్రసిద్ధి

కొబ్బరి వ్యాపార రంగానికి పాలకొల్లు పెట్టింది పేరు. దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు పాలకొల్లు కొబ్బరి వ్యాపారం విస్తరించి ఉంది. పాలకొల్లు పరసర ప్రాంతాల నుంచి మహారాష్ట, గుజరాత్, చత్తీస్‌ఘడ్, తెలంగాణ, బీహార్, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతులు అధికంగా జరుగుతూ ఉంటాయి. వ్యాపారం సీజన్‌లో రోజుకు సుమారు 70 లారీలు, అన్‌సీజన్లో సుమారు 30 లారీల వరకూ వెళ్తూ ఉంటాయి. దాదాపుగా నెలకు రూ. 30 నండి 40 కోట్ల టర్నోవర్ కొబ్బరిపై జరుగుతుండడం విశేషం.

రియల్ ఎస్టేట్‌తో పెరుగుతున్న పట్టణ పరిధి

పట్టణం ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకున్నా నాడు ఎంత విస్తీర్ణం ఉందో నేటికి 4.8 కి.మీ పరిధిలోనే పట్టణం విస్తరించి ఉంది. చుట్టు పక్కల గ్రామాలు విలీన ప్రక్రియ జరుగుతుంది. దీనివల్ల సుమారు పట్టణ విస్తీర్ణం 25 కి.మీ వరకూ పెరగనుంది. ఈ ప్రక్రియతో పట్టణంలో నాలుగు వైపులా రియల్ ఎస్టేట్ రంగం ఊపందుకుంది. దీనికి తోడు నేషనల్ హైవే రోడ్డు పట్టణానికి అతి సమీపంలో ఉండడంతో రియల్ ఎస్టేట్ వ్యాపారం మరింత జోరందుకుంటుంది.

ఊబకాయంతో అనేక సమస్యలు

డాక్టర్ జగ్గురోతు స్వరూప్



ఊబకాయం వల్ల గాల్ బ్లాడర్ స్టోన్ రావడానికి అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని లావణ్య ఆస్పత్రి డాక్టర్ జగ్గురోతు స్వరూప్ అన్నారు. కొవ్వు పదార్థాలు, ఆల్కహాల్ తీసుకోవడం వల్ల గాల్ బ్లాడర్‌లో స్టోన్స్ వస్తుంటాయని పేర్కొన్నారు. గాల్ బ్లాడర్ స్టోన్స్ ఎక్కువ శాతం మహిళలకు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. కుడిపక్క పొట్టలో నొప్పి, వాంతులు, జ్వరం రావడం వంటివి లక్షణాలు కనిపిస్తే జాగ్రత్తపడాలని సూచించారు. గాల్‌బ్లాడర్ స్టోన్స్‌ను అల్ట్రా సౌండ్ స్కానింగ్ ద్వారా గుర్తించవచ్చని, ఈ సమస్య తొలి దశలో ఉండగా మందులు ద్వారా తగ్గించుకోవచ్చని వివరించారు. ఈ వ్యాధి ముదిరితే ఆపరేషన్ చేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దీనిలో రెండు విధానాల ఆపరేషన్లు ఉన్నాయని, ఒకటి కోత ద్వారా ఆపరేషన్ చేయడం రెండు లాప్రోస్కోపిక్ సర్జరీ ద్వారా చేయవచ్చని వివరించారు.

సంతాన సమస్యలకు ప్రత్యేక చికిత్స

డాక్టర్ ఆరుమిల్లి పద్మజారాణి



సంతానం లేని వారికి ప్రత్యేక చికిత్స ఇస్తున్నామని శ్రీ పద్మజ మెటర్నిటీ ఆస్పత్రి డాక్టర్ ఆరుమిల్లి పద్మజారాణి పేర్కొన్నారు. తాము సేవా ధృక్పథంతో వారంలో ప్రతి గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంట వరకూ ఓపీ ఉచితంగా చూస్తున్నానని పేర్కొన్నారు. మహిళల్లో వచ్చే గర్భసంచి గడ్డలు, నడుము నొప్పి, కడుపు నొప్పి, మెనోపాజ్ స్త్రీలలో కలిగే శారీరక సమస్యలు, హార్మోన్స్ సంబంధిత సమస్యలపై చికిత్స అందిస్తున్నట్లు వివరించారు. పెద్ద వయస్సు మహిళల్లో వచ్చే ఆరోగ్య సమస్యల పట్ల చికిత్సతో పాటు సలహాలు సూచనలు చేస్తున్నామని, గర్భిణుల్లో వచ్చే బీపీ, షుగర్, థైరాయిడ్, ఉమ్మనీరు తక్కువగా ఉండడం, శిశువు పెరుగుదల లేకపోవడం, గర్భస్రావం, అధిక రక్తస్రావం, నెలసరి సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. రెగ్యులర్‌గా వ్యాయామం చేయడం వల్ల అనేక లాభాలు ఉన్నాయని తెలిపారు. అలాగే మహిళలకు స్త్రీ సంబంధిత సమస్యలపై అవగాహనతో ఉండాలని సూచించారు. ఆరోగ్యం విషయంలో చిన్న సమస్యే కదా అని వదిలేయకుండా వెంటనే వైద్యం పొందాలని అన్నారు. ఏ రోగాన్నైనా ఆదిలోనే గుర్తు పడితే పరిస్థితి చేయదాటకుండా ఉంటుందని పేర్కొన్నారు.

అతి తక్కువ ధరల్లో బ్రాండెడ్ డ్రెస్‌లు

వట్టం గణేశ్వరరావు



కస్టమర్స్ కోసం అతి తక్కువ ధరలతో బ్రాండెడ్ డ్రెస్‌లు అందుబాటులో ఉన్నాయని వీరభద్ర షాపింగ్ మాల్ అధినేత వట్టం గణేశ్వరరావు తెలిపారు. తమ సంస్థ ద్వారా వస్త్ర రంగంలో 45 సంవత్సరాలుగా కస్టమర్లకు సేవలందిస్తున్నామన్నారు. తామ షాపులో వివిధ రకాల మోడల్స్‌తో నూతన బ్రాండ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఈ ఏడాది ఆకర్షణీయమైన ఆఫర్లు, బహుమతులు కూడా ఏర్పాటు చేశామని వివరించారు. కొత్తగా వచ్చిన మెటీరియల్‌లో కస్టమర్ల కోసం వెయ్యి రూపాయలకే మూడు ఫ్యాంట్లు లేదా మూడు షర్ట్స్ అందిస్తున్నామని కిడ్స్ వేర్‌పై స్పెషల్ ఆఫర్లు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అలాగే రూ. 5 వేలు పైబడి కొనుగోలు చేసిన కస్టమర్లకు ఒక వెండి కాయిన్ ఉచితంగా ఇస్తున్నామని, ఈ ఆఫర్ జనవరి 10వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

డెంగీ విషయంలో జాగ్రత్తలు అవసరం

డాక్టర్ జీఎల్ రాజశేఖర్



డెంగీ వ్యాధి ఏడీసీ దోమ వల్ల వస్తుందని సౌమ్య ఆస్పత్రి డాక్టర్ జీఎల్ రాజశేఖర్ తెలిపారు. ఈ దోమలు వర్షాకాలంలో ఇంటి పరిసరాల్లో నీరు నిలిచిపోయిన గుంటల్లో ఎక్కువగా పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ దోమ పగలు ఎక్కువగా కుడుతుందని తెలిపారు. తీవ్రమైన జ్వరం, తలనొప్పి, నడుంనొప్పి, కళ్లు నొప్పి వంటి లక్షణాల ఉంటే జాగ్రత్త తీసుకోవాలని సూచించారు.. కడుపునొప్పి, వాంతులు, బ్లీడింగ్, చర్మంపై ఎర్రమచ్చలు, ముక్కు ద్వారా, మలం ద్వారా వచ్చే రక్తం, పరాగ్గా మాట్లాడడం వంటివి ఉంటే వెంటనే అప్రమత్తమై వైద్యులను సంప్రదించాలని పేర్కొన్నారు. జ్వరం వస్తే పారాసిట్‌మాల్ వేసుకోవాలి తప్ప నొప్పులకు ఎటువంటి టాబ్లెట్స్ వాడకూడదని సూచించారు. రక్తకణాలు లక్ష లోపు ఉంటే వెంటనే వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందాలని స్పష్టం చేశారు. డెంగీ మొదటి ఐదు రోజులు జ్వరం ఉంటుందని, జ్వరం తగ్గిన తరువాత ఆరు, ఏడు రోజుల్లో ప్లేట్‌లెట్స్ పడిపోవడం మొదలవుతుందని వివరించారు. ప్లేట్‌లెట్స్ తగ్గడానికి డెంగీ ఒక్కటే కారణం కాదని, మలేరియా, స్క్రబ్‌టైపస్, లెప్టోస్పైరల్, లెప్టోస్పైరాసిస్ బ్లడ్ కేన్సర్, సెప్సిస్ వంటి వ్యాధుల వల్ల కూడా ప్లేట్‌లెట్స్ పడిపోతుంటాయని తెలిపారు.